క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

తెలకపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30 మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన మండల కాంప్లెక్స్ మీటింగ్‌హాల్‌లో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, విద్యుత్, పారిశుద్ధ్యం, సాగునీరు, తాగునీరు, పౌరసరఫరాలు, ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్ తదితర అంశాలపైన ఆయా శాఖల మండల అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎండ తీవ్రతతో తగ్గిన భక్తుల సందడి



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తుల సందడి కనిపించలేదు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు భక్తులు రెండు వారాల నుంచి తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. ఆదివారం మూడు వేల మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సన్నాహక సమావేశం



తాడూరు: మండలంలోని శిర్సవాడలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ఆర్థికపరమైన ఏర్పాట్లు, మౌలిక వసతుల కల్పనపై గ్రామస్తుల సమక్షంలో చర్చించారు. మే 20 నుంచి 24 వరకు శ్రీదేవి, భూదేవి, సమేత లక్ష్మీనర్సింహస్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవాలు



పెద్దకొత్తపల్లి: దైవ చింతనతో ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని ముష్టిపల్లిలో చెన్నకేశవస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుమయ్య, రమణారావు, మల్లేష్ పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాలను బలోపేతం చేసుకుందాం



పెంట్లవెల్లి: మత్స్యకార సంఘాలను బలోపేతం చేసుకుందామని ఆ సంఘం మండల అధ్యక్షుడు డబ్బ గోవిందు అన్నారు. మండలంలోని మంచాలకట్టలో ఏడు గ్రామాల అధ్యక్షులు, అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిధులను ఎలా సమకూర్చుకోవాలి, సంఘాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో చర్చించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి అవినాష్, గోపాల్, పెద్దగోపాల్, నర్సింహ, బాలరాజులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్పీని ఆశీర్వదించాలి

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆశీర్వదించాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం నాయకుడు రవికుమార్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ పోలీసు అధికారిగా ఉన్నప్పుడు సామాన్యులకు ఎంతో సహకారం అందించారని, గురుకులాల కార్యదర్శిగా గురుకులాలను ఉన్నతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, వినోద్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాకు చెందిన జె. రాములు కూతురు వివాహం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ నేనావత్ ప్రశాంత్‌నాయక్ బాధిత కుటుంబానికి ఆసరాగా రూ.20 వేల నగదును అందజేశారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



తుర్కలపల్లిలో..



కాంసానిపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో యాదవుల ఆరాధ్యదైవం పెద్దమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాదవ మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామంలోని పెద్దమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ సంఘం నాయకులు కొట్టె శ్రీనివాసులు యాదవ్, బయ్య శ్రీనివాసులు యాదవ్, నరేష్‌యాదవ్, తిర్పతయ్యయాదవ్, బొల్లు మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాలిపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చారకొండ: మండలంలోని తుర్కలపల్లిలో గాలి పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. దంపతులు సాముహిక యజ్ఞం చేశారు. అనంతరం సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. యువకులు నృత్యాలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, కో ఆప్షన్ సభ్యులు సలీం, నాయకులు రమేష్ శ్రీశైలం, మల్లయ్య, నిర్వాహకులు ఉన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కల్వకుర్తిరూరల్: ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలం ఎంగంపల్లిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాతుడూ ప్రతిఒక్కరు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



శ్రీపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని శ్రీపురంలో ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసి తీరుతారని తెలిపారు. మల్లు రవికి ఎంపీ ఆశీర్వదించాలని కోరారు. నాయకులు నర్సింహారెడ్డి, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు బంగారయ్య, వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, మల్లేష్, దామోదర్‌రెడ్డి, బీముడు, చిన్నవెంకటయ్య, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి



హాజరైన నాయకులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామీణ ప్రాంతాలలోని విశ్వబ్రాహ్మణులకు ఆయా బ్యాంకుల ద్వార రుణాలను అందించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని మండల విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు వీరాచారి, భాస్కరాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో విశ్వ బ్రాహ్మణులు కీలకపాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల గురించి పట్టించుకోలేదని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని విశ్వబ్రాహ్మణుల జీవనవిధానాన్ని పరిశీలించి వారి స్థితిగతులను మెరుగుపర్చేందుకు బ్యాంకుల ద్వార ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాలకు సంబంధించిన విశ్వబ్రాహ్మణులు తిరుపతాచారి, కృష్ణయ్య, ఆంజనేయులు, రామాచారి, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మతం పేరుతో రాజకీయాలు సరికాదు



మాట్లాడుతున్న అబ్దుల్లాఖాన్

నాగర్‌కర్నూల్‌రూరల్: మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేయడం సరికాదని సీపీఎం సీనియర్ నాయకుడు అబ్దుల్లాఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలు, కార్మికవర్గం కర్తవ్యం అన్న అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడం దుర్మార్గ మన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు, రామయ్య, ఈశ్వర్, గుంపల్లి అశోక్, వెంకటస్వామి, ధర్మయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, చంద్రకళ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పత్రం పంపిణీలో మొదటిస్థానం

లింగాల: కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీ పత్రం గడపగడపకు చేర్చడంలో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌రాథోడ్ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ మేరకు ఆదివారం నేషనల్ యూత్ కాంగ్రెస్ డోర్ టూ డోర్ ఓటీపీ డాష్ బోర్డులో టాప్ ర్యాంకులను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా అమలు చేయడానికి చేపట్టిన ఐదు గ్యారంటీ పత్రం ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని శ్రీపురం చౌరస్తాలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో చిరువ్యాపారులు సర్వం కోల్పోయారు. ఈ మేరకు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తన్నీరు మురళీ రూ.4 లక్షల వరకు ఆస్తినష్టం జరిగి కుటుంబం రోడ్డున పడడంతో యువశక్తి ఫౌండేషన్ సభ్యులు 50 కేజీల సన్నబియ్యం, నెలకు సరిపడే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాగితాల మధు, ప్రేమ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు పొదిల రామయ్య, గుడ్ల శ్రీనివాస్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి తోడ్పాటు



పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల గ్రామానికి చెందిన చింతకుంట బాలపీర్ పక్షవాతం వ్యాధితో పడుతున్నాడు. తోటి మిత్రులు 1985వ బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు బాధితుడిని పరామర్శించి ప్రతి నెల రూ.2000లు ఆర్థికసహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు ఆదివారం గుర్రం శ్రీనివాసులు రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో బాలెమియా పాల్గొన్నారు.

కుక్కల బెడద తీరినట్లేనా?

- ఒక్కరోజే 50కి పైగా కుక్కల పట్టివేత

అచ్చంపేట రూరల్: పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాలకులు అంటున్నా మున్సిపాలిటీల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. వార్డులలో కనీస వసతులు దేవుడెరుగు కాని కుక్కల బెడదతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు కూడా జంకుతున్నారు. ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనని భయాందోళనకు గురువుతున్నారు. వాహనదారులు కూడా వదిలం లేదు. గుంపులుగా వచ్చి వాహనదారుల వెంట పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు, పాలకులు కుక్కలు, కోతులు, దోమల కూడా నియంత్రించలేని పరిస్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం రూ. లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. ఇటీవల కాలనీ ప్రజలు, చిన్నారులు. వృద్ధులు, మహిళలకు కుక్కకాటు మాత్రం తప్పడం లేదు. మున్సిపాలిటీల్లో అక్రమాల కారణంగా అసలు లక్ష్యాన్ని పక్కనబెడుతున్నారు. కుక్కల నియంత్రణ మాత్రం క్షేత్రస్థాయిలో ఏమాత్రం జరగడం లేదు. ప్రస్తుత పాలకవర్గానికి పదవులను కాపాడుకోవడానికి ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై మాత్రం దృష్టి సారించడంలేదు.

కుక్కల పట్టివేత

అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలను నియంత్రించేందు ఎట్టకేలకు ఆదివారం అచ్చంపేట మున్సిపల్ అధికారులు నడుంబిగించారు. పట్టణంలోని టీచర్స్ కాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీలతో పాటు పలు కాలనీల్లో మూడు రోజుల కిందట 20 మందికి పైగా చిన్నారులు, వృద్ధులను వీధి కుక్కలు కరిచి తీవ్రంగా గాయపర్చిన సంఘటన తెలిసిందే. మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, చైర్మన్ నర్సింహగౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆదివారం ప్రత్యేకంగా కుక్కలను పట్టుకునే వారిని పిలిపించారు. ప్రధాన రహదారి, వివిధ కాలనీల్లో ఉన్న వీధి కుక్కలను పట్టుకున్నారు. ఒక్కో కుక్కను పట్టుకోవడానికి రూ. 1500లు వెచ్చించినట్లు తెలుస్తోంది. కాగా ఖర్చు వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు.

పెరిగిన కుక్కకాటు కేసులు...

అచ్చంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. ప్రతి రోజు పదుల సంఖ్యలో కుక్కల దాడి బాధితులు పెరుగుతున్నారు. అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటు కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా ఆస్పత్రిలో కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యం అంతంత మాత్రంగానే ఉంది. రేబీస్ అధికం కాకుండా పెద్దాసుపత్రులకు రెఫర్ చేస్తునారు. అందుకు సంబంధించిన ఇతర వ్యాక్సిన్ అచ్చంపేటలో లేకపోవడంతో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పెద్దాసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

కుక్కలు పట్టుకుంటాం



పట్టణంలోని వివిధ కాలనీల్లో ఉన్న వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బందితో పట్టుకుంటున్నాం. ప్రత్యేకంగా కుక్కలను పట్టుకునే వారిని పిలిపించాం. ఆదివారం 50 కుక్కల వరకు పట్టుకున్నాం. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– నర్సింహగౌడ్, మున్సిపల్ చైర్మన్, అచ్చంపేట

సత్తాచాటిన గురుకులాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని గురుకుల కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో ఎస్సీ గురుకుల కళాశాలలకు సంబంధించి మొదటి సంవత్సరంలో జిల్లాల వారీగా గద్వాలలో 72.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. వనపర్తిలో 72.21, నాగర్‌కర్నూల్‌లో 73.4, మహబూబ్‌నగర్‌లో 80.89 శాతం, నారాయణపేటలో 77.92 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో వనపర్తి 83.28 శాతం, నాగర్‌కర్నూల్ 81 శాతం, మహబూబ్‌నగర్ 91 శాతం, గద్వాల 76.1, నారాయణపేట 82.3 శాతం నమోదైంది.

- ఎస్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 71.43 శాతం, వపపర్తి 95.38, మహబూబ్‌నగర్ 73.02, నాగర్‌కర్నూల్ 72.09, నారాయణపేట 71.63 శాతం సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో గద్వాల 84.21, వనపర్తి 94.67, నాగర్‌కర్నూల్ 85.85, మహబూబ్‌నగర్ 83.33, నారాయణపేట 91.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- టీఎస్‌ఆర్‌జేసీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 89.33, మహబూబ్‌నగర్ 97.53, రెండో సంవత్సరంలో గద్వాల 92.65, మహబూబ్‌నగర్ 98.8 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో కళాశాలలు లేవు.
- మోడల్ స్కూళ్లలో మొదటి సంవత్సరం వనపర్తిలో 50.17, నాగర్‌కర్నూల్‌లో 38.07, మహబూబ్‌నగర్‌లో 50, నారాయణపేటలో 47.2 శాతం ఉంది. రెండో సంవత్సరంలో వనపర్తిలో 69.6, నాగర్‌కర్నూల్‌లో 55.34, మహబూబ్‌నగర్‌లో 69.6, నారాయణపేటలో 46.86 శాతం ఉత్తీర్ణత సాధించగా గద్వాలలో కళాశాల లేదు.
- కేజీబీవీల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 73.84, వనపర్తిలో 74.2, నాగర్‌కర్నూల్‌లో 63.77, మహబూబ్‌నగర్‌లో 76.45, నారాయణపేటలో 72.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో గద్వాలలో 83.9, వనపర్తి 83.3, నాగర్‌కర్నూల్ 75.58, మహబూబ్‌నగర్‌లో 85.84, నారాయణపేటలో 76.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- మైనార్టీ గురుకులాల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 83.87, వనపర్తిలో 73.21, నాగర్‌కర్నూల్‌లో 60.32, మహబూబ్‌నగర్‌లో 73.57, నారాయణపేటలో 75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెండో సంవత్సరంలో గద్వాల 88.7, వనపర్తిలో 82.86, నాగర్‌కర్నూల్‌లో 85.25, మహబూబ్‌నగర్‌లో 86.6, నారాయణపేటలో 87.78 శాతం ఉత్తీర్ణత వచ్చింది.
- ప్రభుత్వ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో గద్వాల 47.65 శాతం, వనపర్తిలో 35.68, నాగర్‌కర్నూల్‌లో 34.35, మహబూబ్‌నగర్‌లో 42.08, నారాయణపేటలో అత్యల్పంగా 29.61 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక రెండో సంవత్సరంలో గద్వాల 59.96, వనపర్తి 51.4, నాగర్‌కర్నూల్‌లో 49.8, మహబూబ్‌నగర్‌లో 50.94, నారాయణపేట 41.23 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.
- బీసీ గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో గద్వాల 88.35 శాతం, వనపర్తి 77.6, నాగర్‌కర్నూల్ 74.73, మహబూబ్‌నగర్ 72.44, నారాయణపేట 64.41 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. రెండో సంవత్సరంలో గద్వాలలో 93.44, వనపర్తిలో 84.97, నాగర్‌కర్నూల్‌లో 88.39, మహబూబ్‌నగర్‌లో 91.8, నారాయణపేటలో అత్యధికంగా 96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

బీజేపీతో సుస్థిర పాలన



మాట్లాడుతున్న ఎంపీ రాములు

బల్మూర్: బీజేపీతో సుస్థిర పాలన సాధ్యమని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి బల్మూర్, కొండనాగుల, సీతారాంపూర్, అనంతవరం గ్రామాల్లో రోడ్‌షో కార్నర్ మీటింగ్‌లో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌తో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా పెంపొందించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. రాష్ట్ర నాయకులు సీతారాంరెడ్డి, బాలాజీ, మంగ్యానాయక్, రవీందర్‌రెడ్డి, రెణయ్య, మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, రమేష్, తిరుపతిగౌడ్, బాలకృష్ణ, శ్రీనునాయక్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మన్ననూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపు తథ్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు దీమా వ్యక్తం చేశారు. ఆదివారం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ గ్రామంలోని వివేకానంద విగ్రహం వద్ద పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నాగరాజు, రేణయ్య, గోలి రాజు, వెలిజాల శ్రీను, ప్రసాద్, శాంతికుమార్, వాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఎంపీ పోతుగంటి రాములు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సలేశ్వరం, నవీన్, విష్ణు, జానకమ్మ, మంగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆదివారం మండలంలోని ఎంగంపల్లి తాండలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. మండల అధ్యక్షుడు ప్రసాద్, ఖలీల్, వెంకటస్వామి, మూలె వెంకటేష్, రవి పాల్గొన్నారు.

ఎంపీటీసీకి నంది అవార్డు



దోమలపెంట: ఎంపీటీసీ మల్లికార్జునకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు ఉగాది నంది అవార్డు -2024 దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో రవీంద్ర భారతిలో వల్లూరి ఫౌండేషన్ వారు నిర్వహించిన తెలుగు సంవత్సరాది ఉగాది ఉత్సవాల కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. గ్రామస్తులకు వివిధ రకాలుగా ఉచిత సేవలు అందించడంతో అవార్డు అందించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు వి.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. మిస్ ఇండియా స్నేహచౌదరి, దైవజ్ఞశర్మ, అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్, ఏపూరి సోమన్న, చింతకుంట రమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 25వేల విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం కోసం దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అచ్చంపేటకు చెందిన పుట్ట శ్రీపతి నిత్యాన్నదానం కోసం రూ. 25,116లు అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ప్రమోద్, కవిత, ప్రవీణ్, నిశాంతి, అరవింద్, దీప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ రాము(49) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేటకు చెందిన రాము ఇంటి వద్ద ఉండగా ఛాతిలో నొప్పి రావడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యుడు నాగర్‌కర్నూల్ కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. ఆర్టీసీ బస్సులో నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా బస్సులోనే కుప్పకూలాడు. నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అచ్చంపేట ఆర్టీసీ డీఎం, కార్మికులు సంతాపం ప్రకటించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వల విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2000-01వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగం, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. జీహెచ్‌ఎం భగవంత్ రెడ్డి, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉదయ్, చింతసత్తి, నాగరాజు, బాలరాజు, బలరాం, రాజు, హరీష్, నాగేశ్వరి, విజయ, సంతోష్, నాగేశ్వరి, విజయ పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం



పుల్జాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పుల్జాలలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గడపగడప తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ. 2500, పంటలకు రూ.5 వేల బోనస్, రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.